క్లుప్తంగా

సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ట



సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్టలో ఉపాధ్యాయులు

మైదుకూరు : మండలంలోని వనిపెంట మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో బుధవారం సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా గణపతి హోమం, రుద్రహోమం, చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ నిర్మల, రిటైర్డ్ ప్రిన్సిపాల్, విగ్రహ దాత శ్రీనివాసులు, శివ బాలిరెడ్డి, సూర్యనారాయణ, జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బి.మఠం పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండకేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమా మహేశ్వరరెడ్డి తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో వ్యాధినిరోధిక టీకాల గదిని, రికార్డులు, ఆసుపత్రి పరిశుభ్రత, ఏపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పిల్లలకు, గర్భిణులకు సరైన టీకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ మల్లేష్, స్థానిక డాక్టర్ సంపత్‌కుమార్, సీహెచ్‌ఓ మునిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం



అరటి పండు అందిస్తున్న డాక్టర్ టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఈసీ మెంబర్, ప్రముఖ వైద్య నిపుణుడు టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం మధ్యాహ్నం విద్యార్థి అనాథ శరణాలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పిల్లలకు డాక్టర్ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో దియ రవితోపాటు పలువురు పాల్గొన్నారు.

8న వరలక్ష్మి వ్రతం

రాజుపాళెం : మండలంలోని పుణ్య క్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాలకు సంబంధించి 8న శుక్రవారం వరలక్ష్మి వ్రతం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరయణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణంలోని సంజీవరాయ కల్యాణ మండపంలో వ్రతం ఉదయం 9 గంటలకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే మహిళలంతా పూలు, పండ్లు, టెంకాయలు వారే తెచ్చుకోవాలని సూచించారు. అక్కడకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వారు వివరించారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

చాపాడు : మండల పరిధిలోని రాజువారిపేట, విజయనగరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత రైతులతో సమావేశమైన వరి సాగు విధానంలో మెళకువలు, సూచనలు చేశారు. వరి సాగులో అధికంగా యూరియా వాడకం చేస్తే దుష్ప్రభావాలు జరుగుతాయని, వ్యవసాయ సిబ్బంది సూచనలు తీసుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ స్వప్న, వీఏఏ లు సుప్రియ, విమతా తదితరులు పాల్గొన్నారు.

బెడుసుపల్లెలో జ్వరాలు

గోపవరం : మండలంలోని రాచాయపేట పంచాయతీలోని బెడుసుపల్లెలో జ్వరాలతో మంచం పట్టారు. చిన్నపిల్లల నుండి పెద్దల వరకు ప్రతి ఇంటిలో జ్వరాలతో బాధపడుతున్నారు. ఇప్పటికే కొందరు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించారు. సీజనల్ జ్వరాలుగా భావిస్తున్నారు. వైద్య సిబ్బంది గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వరాల బారిన పడిన వారికి చికిత్స అందించాలని బాధితులు కోరుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలోనే బెడుసుపల్లె గ్రామం ఉంది. ఎక్కువ మంది బాధితులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైద్యశిబిరం ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు.

వైభవంగా బ్రహ్మంగారి మాస కల్యాణోత్సవం



కల్యాణానికి హాజరైన భక్తులు



స్వామివారి మాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బ్రహ్మంగారిమఠం : శ్రీమద్విరాట్‌పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబల మాస కల్యాణ మహోత్సం బుధవారం బి.మఠంలో ఘనంగా నిర్వహించారు.

శ్రీమాతాగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణానికి మహిళా భక్తులు అధికంగా పాల్గొన్నారు. దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో మేనేజర్ ఈశ్వరాచారి నిర్వహణలో మఠం ఆస్థాన పూజారులు ఇడమకంటి జనార్ధనాచార్యులు కల్యాణం నిర్వహించారు. పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వెంకటాద్రిస్వామి, వీభద్రయ్యస్వామి, బ్రహ్మంయ్యస్వామి దంపతులు పాల్గొన్నారు. కల్యాణంను తిలకించేందుకు తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి, ప్రొద్దుటూరుకు చెంది గవల స్వామి కృష్ణమాచారి, ప్రొద్దుటూరు, దువ్వూరు, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కళ్యాణం ఉభయధాతలతోపాటు, మాస కళ్యాణంకు రూ.1లక్ష విరాలు ఇచ్చినదాతలు పాల్గొన్నారు.

కార్మికులకు రూ.26వేలు వేతనం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బి.రామయ్య

ప్రొద్దుటూరు : జీఓ 36 ప్రకారం మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.26వేలు వేతనం చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రొద్దుటూరు యూనిట్ అధ్యక్షుడు బి.రామయ్య తెలిపారు. మండలంలోని పెన్నానగర్ సీపీఐ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు ప్రభుత్వాలు సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదని అన్నారు. స్కూల్ స్వీపర్లకు, టాయిలెట్ వర్కర్స్‌కు నెలకు రూ.21వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సరెండర్ లీవులు, గ్రాట్యూటీ, అరియర్స్‌ను చెల్లించాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు ఆరు డీఏల బకాయిలను వెంటనే ఇవ్వాలని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. చనిపోయిన కార్మికుల సంతానానికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, పీఎఫ్ ఖాతాలను సక్రమంగా అమలు పరచాలని తెలిపారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమ్మెకు సిద్ధమవుతున్నదని, అందులో భాగంగా ఈనెల 9న కార్మికులు టూల్ డౌన్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఏఐటీయూసీ కోఆర్డినేటర్ కమిటీ సెక్రటరీ గంగా సుధాకర్, ఎంపీజే నాయకుడు సలీం, రిటైర్డ్ టీచర్ రషీద్ ఖాన్ కార్మికులకు మద్దతుగా ప్రసంగించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి మధు, నాగరాజు, శ్యామ్, గురుమూర్తి, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాకురాలు లక్ష్మీదేవి, అరుణ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో స్నాతకోత్సవం నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన వర్సిటీ స్నాతకోత్సవం త్వరగా నిర్వహించాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేస్, కార్యదర్శి అక్షయ్ కుమార్‌రెడ్డిలు కోరారు. ఈ విషయమై బుధవారం రిజిస్ట్రార్ పుత్తా పద్మను వైవీయూలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా వైవీయూలో కాన్వొకేషన్ నిర్వహించకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన కాన్వొకేషన్ నిర్వహించాలని కోరారు. అలాగే వర్సిటీలో వసతి గృహాల్లో వైఫై ఏర్పాటు చేయడంతోపాటు వసతులను మెరుగు పరచాలని కోరారు.

ఆకట్టుకున్న మా ఎగ్జిబిషన్



మా ఎగ్జిబిషన్ అండ్ సేల్స్‌లో కొనుగోలుదారుల సందడి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలను మా ఎగ్జిబిషన్ అండ్ సేల్ ఆకట్టుకుంది. బుధవారం ఎగ్జిబిషన్ నిర్వాహకులు కడప నగరం ప్రకాశ్‌నగర్‌లో గల తమ ఎగ్జిబిషన్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. 92.5 ప్యూర్ సిల్వర్ జ్యువెలరీ, ప్యూర్ బెనారస్ పట్టు, వెంకటగిరి పట్టు, కంచి పట్టు, ప్యూర్ జ్యామ్‌దాని శారీస్, ఫ్యాన్సీ శారీస్, జ్యామ్‌దాని డ్రస్ మెటీరియల్, బెడ్‌షీట్స్, దివాన సెట్స్, ఫ్యాబ్రిక్స్ తమ ప్రత్యేకతలన్నారు. ప్రజల ఆదరణకు మరోమారు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని వివరించారు. భవిష్యత్తులో కూడా మరింత మెరుగైన వస్త్రాలు, ఆభరణాలతో కూడిన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామని వారు వివరించారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

డీఎస్పీ భావన



కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన వారితో డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు కల్చరల్ : బాధ్యతగా విధులు నిర్వహించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు డీఎస్పీ భావన సూచించారు. స్థానిక తక్షశిల కోచింగ్ సెంటర్‌లో బుధవారం కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను డీఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు ఉద్యోగాలు ఎంతో బాధ్యతాయుతమైనవని, ప్రజలకు సేవ చేసేందుకు ఈ ఉద్యోగాన్ని ఎంచుకున్న వారిని అభినందించారు. కోచింగ్ సెంటర్‌లో 36 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. కష్టపడి ఉన్నత స్థానాలను చేరుకోవాలని సూచించారు. అదనపు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బసివిరెడ్డి మాట్లాడుతూ కష్టపడి పోలీసు ఉద్యోగం సాధించారని, బాధ్యతగా విధులు నిర్వహించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన వారందరికి కోచింగ్ సెంటర్ తరపున యూనిఫాం అందించారు. కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సురేంద్ర, నరేష్, నిర్మల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవో అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి

ముద్దనూరు : ముద్దనూరు తాలూకా ఎన్జీవో అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ముద్దనూరులో జరిగిన ఎన్నికలకు ఎన్నికల అధికారిగా బ్రహ్మానందరెడ్డి వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి, సహ అధ్యక్షుడిగా రమణయ్య, ఉపాధ్యక్షులుగా షేక్ యాసీన్, రాజశేఖర్‌నాయుడు, ప్రసాద్‌రెడ్డి ఎన్నిక కాగా కార్యదర్శిగా ఎం.జాషన్, సంయుక్త కార్యదర్శిగా అనిల్‌కుమార్‌రెడ్డి, విశాలక్ష్మి, పరమేశ్వరి, ఓబులేసులు, కోశాధికారిగా డాక్టర్ కరిస్మా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామారావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్‌యాదవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్‌లు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి సిబ్బందికి టీబీ స్కిన్ టెస్ట్




సిబ్బందికి స్కిన్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రధానమంత్రి టీబీ ముక్తభారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా ఆస్పత్రిలో పని చేసే సిబ్బందికి టీబీ స్కిన్ టెస్ట్ నిర్వహించారు. శరీరంలో ఎలాంటి ఇన్‌ఫెక్షన్ ఉన్నాయో ఈ టెస్ట్ ద్వారా తెలుస్తుందని టీబీ యూనిట్ ఎంపీహెచ్ఎస్ రాజారత్నం తెలిపారు. ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి రక్త పరీక్ష, ఎక్స్ రే, గళ్ల పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ పరీక్షల్లో పాజిటివ్ అని తేలితే టీబీ మందులు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్, ఆర్ఎంఓ గోపాల్, టీబీ సూపర్‌వైజర్ హుస్సేన్‌బాషా, టీబీహెచ్‌వీ గురుప్రసాద్, సిద్ధారెడ్డి, విజయ్, వీణ, సుజాత, భవ్య పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌లో కర్నూలు జట్టు విజయం

కడప కార్పొరేషన్ : విద్యుత్ సంస్థలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఆసక్తికరంగా జరుగుతున్నాయి. బుధవారం సీకేదిన్నె పోలీస్‌స్టేషన్ ప్రక్కనున్న మైదానంలో జరిగిన ఫుట్‌బాల్ ఫైనల్ మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. ఇందులో 2–0 తేడాతో కర్నూలు జట్టు విజయం సాధించింది. ఏపీ ట్రాన్స్ కో చీఫ్ ఇంజినీర్ క్రిష్ణకుమార్, జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, స్పోర్ట్స్ సెక్రటరీ వీరాంజనేయులు, మస్తాన్, కల్చరల్ సెక్రటరీ వీరభద్రయ్యలు మ్యాచ్‌ను పర్యవేక్షించారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు




సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు

మైదుకూరు : ఎస్టీయూ మైదుకూరు మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మైదుకూరు మండలంలోని నంద్యాలంపేట, శెట్టివారిపల్లె, వనిపెంట, లెక్కలవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మైదుకూరు ఉర్దూ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్, ఎస్.మైదుకూరు ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కూశెట్టి పాలకొండయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్ మాట్లాడుతూ విద్యా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయూ కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని, ఐఆర్‌ను ప్రకటించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వై.వెంకట సుబ్బయ్య, అసోసియేట్ అధ్యక్షుడు జి.మల్లేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బీకే సురేష్, మైదుకూరు రీజియన్ కన్వీనర్ వెంకటేశ్వరరాజు, మండల అధ్యక్షుడు రమణయ్య, జి.చంద్రశేఖర్, కె.ఆనందరావు, యు.రవీంద్రారెడ్డి, ఈశ్వరయ్య, కిరణ్ ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితం బుగ్గిపాలు

కడప ఎడ్యుకేషన్ : డ్రగ్స్‌తో జీవితం బుగ్గిపాలు అవుతుందని, డ్రగ్‌కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండి డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని ఈగల్ అధికారులు సూచించారు. బుధవారం కడప మండలం ఆలంఖాన్‌పల్లి జిల్లా పరిషత్తు హైస్కూల్లో గంజాయి, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి విక్రయాలు జరుగుతూ ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1972కు కాల్ చేయాలన్నారు.

సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి ఓ సాధనం



బహుమతులు అందుకున్న విజేతలను అభినందిస్తున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి ఒక శక్తివంతమైన సాధనమని ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీం బాషా అన్నారు. సమాచార హక్కు చట్టం – 2005 ఏర్పాటై 20 ఏళ్ల పూర్తి అవుతున్న సందర్భంగా బుధవారం ఆర్.టి.ఐ మీద జోనల్ (కడప కర్నూలు చిత్తూరు అనంతపురం) స్థాయి పోటీలు కడపలోని ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో (స్వయం ప్రతిపత్తి) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీం బాషా మాట్లాడుతూ విద్యార్థులు సమాచార హక్కు చట్టం గురించి పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని రీజినల్ జాయింట్ డైరెక్టర్ డా. డి. నాగలింగ రెడ్డి మార్గదర్శకత్వంలో నిర్వహించామని తెలిపారు. విజేతలు రాష్ట్రస్థాయిలో ఈనెల 11వ తేదీన విజయవాడలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

పోటీలలో విజేతలు..

వ్యాసరచన : ఓమేశ్వరి వాణి, కె.టి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాయదుర్గం.

వక్తృత్వం : ఎ. మదిహా, ఎస్ ఎస్ పి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హిందూపురం

వాదన (డిబేట్) జట్టు : ఎస్. అకిఫా బటోల్, షేక్ జేబా, ఎస్‌కె ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల, కడప.

క్విజ్ జట్టు : వై. పూజిత, బి. సాలమ్మ, ఎం. కీర్తి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పులివెందుల.

ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులను నోడల్ రిసోర్స్ సెంటర్ ప్రిన్సిపాళ్లు, కళాశాల అధ్యాపక బృందం ప్రశంసా పత్రం, మొమెంటోలు అందజేసి అభినందించారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ప్రారంభించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు డా బీ ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెద్దలపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధపడుతూ ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు వెళ్లే స్తోమత లేక ఇంటి దగ్గర చదివితే ఉద్యోగాలు వస్తాయని నమ్మకం లేక ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. వీరికి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ స్టడీ సర్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లా కేంద్రాల్లో ఉచిత శిక్షణ ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అప్రజాస్వామ్యం

అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు తవ్వా వెంకటయ్య



మాట్లాడుతున్న తవ్వా వెంకటయ్య

మైదుకూరు : పులివెందుల నియోజకవర్గంలో జెడ్పీటీసీ ఎన్నికల్లో భాగంగా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ నాయకులు దాడి చేయడం అప్రజాస్వామ్యమని అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు తవ్వా వెంకటయ్య అన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడిని ఖండించారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు కొలమానమని, కూటమి నేతలు అందుకు భిన్నంగా ప్రవర్తించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నేతలు ఎవరికి వారు ప్రచారం చేసుకోవాలని, అంతిమంగా ప్రజల తీర్పును గౌరవించాలే తప్ప ఇటువంటి భౌతిక దాడి హేయమని అన్నారు. దీన్ని ప్రజాస్వామ్య వాదులు ఖండించాలన్నారు. కూటమి నేతలు భౌతిక దాడులతో ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి ప్రజలలో చులకన కావద్దని హితవు పలికారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో మొదలైన వ్యతిరేకతను అణచివేయడానికే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి



జాతీయ సమావేశాల కరపత్రాలను విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు కడపలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో నిర్వహించనున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ తెలిపారు. బుధవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఏఐఏడబ్ల్యూయూ జాతీయ సమావేశాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాన్ని 1934లో జాతీయ కార్మిక సంఘ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య నెల్లూరు జిల్లా అలగానిపాడులో ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసినట్లు తెలిపారు. జాతీయ సమావేశాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మేధావులు, ఆర్థిక విశ్లేషకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో జిల్లాలోని వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రం డేవిడ్ రాజ్, శీను, ఓబయ్య, శివ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య

ప్రొద్దుటూరు క్రైం : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని డాక్టర్ భరత్ నారాయణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. జామియా మసీదు వీధిలోని అంగన్‌వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యత గురించి గర్భిణులు, తల్లులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు తొలి టీకాతో సమానమన్నారు. పుట్టిన వెంటనే అరగంట లోపు తల్లి పాలు పట్టించడం బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమని చెప్పారు. మొదటి ఆరు నెలల వరకు శిశువుకు చనుబాలే ఆహారంగా ఇవ్వాలని, తర్వాత పాలతో పాటు అనుబంధ ఆహారాన్ని తినిపించాలని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి అంటు వ్యాధులు, అతిసారం, శ్వాసకోశ సంబంధించిన వ్యాధుల బారి నుంచి శిశువుకు రక్షణ కలుగుతుందని వారు పేర్కొన్నారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

చాపాడు : తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టినప్పటి నుంచి తల్లి పాలను తాపించాలని సీడీపీఓ సయ్యద్ ముంతాజ్ బేగం పేర్కొన్నారు. మండలంలోని శ్రీరాములపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ.. తల్లిపాలన వారోత్సవాల కార్యక్రమాల ద్వారా గ్రామాల్లోని తల్లులకు పాల విశిష్టత తెలియజేయటం జరుగుతుందన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి గంట లోపు ముర్రుపాలు తాపించాలని, తర్వాత క్రమం తప్పకుండా వైద్యులు సూచనలు పాటిపంచాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ అంగన్వాడీ కేంద్రాలను పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రవీణ, అంగన్వాడీ వర్కర్లు ఇందిరాదేవి, శ్రీశాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ నీలావతి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య తెలిపారు. బుధవారం కోటవీధి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై బాలింతలకు, గర్భిణులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టించడం ద్వారా ఎన్నో పోషకాలు అందడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే తల్లికి కూడా గర్భసంచి, రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. డబ్బా పాలు వద్దు–తల్లిపాలు ముద్దు అనే నినాదంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు గర్భిణులకు, బాలింతలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రతి తల్లి తమ పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం స్వాతి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ఆటలపోటీలు



విజేతలతో ఉపాధ్యాయులు

పోరుమామిళ్ల : పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం పరుగుపందెం పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శామ్యూల్ జోబ్, పీఈటీ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రానున్న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించారు. 100 మీటర్ల పరుగులో యోగానాయక్ ప్రథమస్థానం, వెంకట చరణ్ ద్వితీయ స్థానం, ఈశ్వర్ తృతీయస్థానంలో వచ్చారు. 400 మీటర్ల పరుగులో యోగానాయక్ ప్రథమ స్థానం, ఈశ్వర్ ద్వితీయ స్థానం, శివనాయక్ తృతీయ స్థానంలో వచ్చారు. వారికి బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడ్డ చౌడయ్య

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారి వాహిద్ నగర్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. ఖాజీపేట మండలం అప్పనపల్లెకు చెందిన చౌడయ్య ఎర్రగుంట్లలో జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొని ద్విచక్ర వాహనంలో కడప వైపుకు ప్రయాణిస్తూ వాహిద్ నగర్ వద్దరాగా కమలాపురం వైపుకు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక భాగంలో ఢీ కొట్టాడు. దీంతో కిందపడ్డ అతడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స కోసం అతన్ని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

పెయింటర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



పెయింటర్స్ యూనియన్ నూతన కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం హరి అధ్యక్షతన పెయింటర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా నాగేంద్ర, ఉపాధ్యక్షుడుగా వి.వెంకటకృష్ణ, కార్యదర్శిగా పూసల ఏసోబు, జాయింట్ సెక్రటరీగా జీఎస్ఎం బాషా, కోశాధికారిగా పి.సాంబయ్య, జాయింట్ ట్రెజరర్‌గా ఎం.చిన్నా, సలహాదారులుగా ఎం.మత్తయ్య, వి.ప్రసాద్‌రావు, కుండా బాలదాసు, జి.శివప్రసాద్, రొక్కం సుబ్బరాయుడు, పి.రవి, జె.మదన్, ఎస్‌సీ సిరాజుద్దీన్, చంద్ర, జి.హరినారాయణ, చంద్రారెడ్డి, బాషలను ఎన్నుకున్నారు.